



ఎస్టీలకు 'ఉపాధి' పనులు కల్పించాలి

ప్రజాశక్తి-నెల్లూరు :ఉపాధి హామీ పథకంలో పనులను అడగలేని పేద ఎస్టీ లబ్ధిదారులను గుర్తించి, వారిని పని కల్పించాలని ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు కలెక్టర్ ఒ. ఆనంద్ సూచించారు. ఆదివారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు పై క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణులకు ఉపాధి కల్పించే ఈ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ ను వేజ్ కాంపోనెంట్ ను పెంచాలన్నారు. నిర్దిష్ట వంద రోజుల పని దినాలను కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించలేదనే మాట రాకుండా అన్నివిధాలా చర్యలు తీసుకోవాలన్నారు. వేజ్ కాంపోనెంట్ పెరగకపోతే గ్రామాల అభివృద్ధి ఆగిపోతుందన్నారు. అందుకోసమే మెటీరియల్ కాంపోనెంట్, వేజ్ కాంపోనెంట్ పెంపును సమర్థంగా అమలు చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు.క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీచంద్, డ్వామా పీడి గంగా భవాని, డ్వామా ఫైనాన్స్ అధికారి కనకదుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఓ ఆనంద్

ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లండి..!

సిపిఎం రూరల్ మహాసభలో 'విఎస్ఆర్'



మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా ఉద్యమానికి ప్రత్యేక చరిత్ర ఉందని, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎన్నో పోరాటాలు నిర్వహించారని, రానున్న రోజుల్లో ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లి ప్రజలకు చేరువ కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. ఆదివారం ఉదయం జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలోని మినీహాలులో ఆపార్టీ 4వ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభలో ప్రారంభ ఉపన్యాసం చేశారు. తొలుత పార్టీ మహాసభ సందర్భంగా పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకురాలు రమమ్మ ఆవిష్కరించారు. అనంతరం వి శ్రీనివాసరావు మాట్లాడుతూ నెల్లూరు ప్రాంతంలో ఇళ్ల స్థలాల పోరాటాలు, దోమలు, చెత్త నివారణ, మంచినీరు, వంటి ప్రజల కనీస సౌకర్యాల సాధనకోసం పోరాటాలు నిర్వహించారన్నారు. రానున్న కాలంలో ప్రజా ఉద్యమాలకు పదును పెట్టి, పోరాటాలు నిర్వహించాలన్నారు.జాతీయ, అంతర్జాతీయ విషయాలను ఆయన ప్రస్తావించారు. వైసిపి, టిడిపి ప్రభుత్వాలు మారాయి తప్ప విధానాలు అలాగే ఉన్నాయన్నారు. అవినీతి విషయంలో టిడిపి బోగస్ పోరాటాలు చేస్తుందన్నారు. అంతర్జాతీయంగా నేడు కమ్యూనిజం పుంజుకుంటుందన్నారు. ఇది మరింత ఉధృతంగా ముందుకు రానుందన్నారు. 90లో సోషలిజం సైద్ధాంతిక ఆధిపత్యం కొనసాగించిందన్నారు. రంగాల్లో దాని ప్రభావం కనిపించిందని, ఇటీవల కాలంలో కొంత ఇబ్బందులు వచ్చినా ప్రపంచ వ్యాపితం సోషలిజం కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. అందుకు నిదర్శనం ఇటీవల శ్రీలంకలో జరిగిన ఎన్నికలేనన్నారు. గత ఎన్నికల్లో కేవలం మూడు శాతం మాత్రమే ఓట్లు ఉన్న కమ్యూనిస్టుపార్టీ గణనీయంగా పుంజుకొని అధికారంలో వచ్చిందని గుర్తు చేశారు. ఒకప్పుడు చంద్రబాబు నాయుడు కమ్యూనిజానికి కాలం చెల్లిందని చెప్పారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు విధానాలకు కాలం చెల్లిందన్నారు. మారాల్సింది కమ్యూనిస్టులు కాదని, చంద్రబాబు నాయుడు అన్నారు. అవినీతి అంతుచూస్తానని చెప్పి చంద్రబాబు నాయుడు అమెరికాలో రూ 1750 కోట్ల అవినీతిపై కేసు పెడితే ఇక్కడ ఎందుకు భయపడుతున్నారన్నారు. అదానీ, జగన్‌ను కాపాడడానికి చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. జాతీయ స్థాయిలో మతోన్మాదం నుంచి ప్రమాదం పొంచి ఉందన్నారు. మత విద్వేషాలు పెంచడానికి బిజెపి ప్రయత్నం చేస్తుందన్నారు. కుంభమేళలో ఏం జరిగిందో చూశామన్నారు. తామే దేశాన్ని శాసిస్థామని అఘోరాలు చెబుతున్నారని, దీనిని బిజెపి పోత్సహిస్తుందన్నారు. రాష్ట్రంలో పవన్‌కళ్యాణ్ సనాతనధర్మం పేరుతో ఊరు ఊరు తిరుగుతున్నారని, ఏడేళ్ల కిందట బిజెపినికి తిట్టిన పవన్‌కళ్యాణ్ ఇప్పుడు దాన్ని మోస్తున్నారన్నారు. భాష పేరుతోనూ రాజకీయాలు చేస్తున్నారన్నారు. హిందీని దేశంపై రుద్దడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. భాషను బలవంతంగా రుద్దవద్దని, మాతృభాషలోనే చదువు చెప్పాలన్నారు. నియోజకవర్గాల డీ లిమిటేషన్‌లో ప్రస్తుత చర్చ జరుగుతుందని, ఎక్కువ జనాభా ఉన్న రాష్ట్రాల్లో ఎక్కువ సీట్లు వస్తాయని, తక్కువ జనాభా ఉంటే తక్కువ వస్తాయన్నారు. దక్షణాది రాష్ట్రాల్లో ఎక్కువ కాలం కుటుంబ నియంత్రణ అమలు జరిగిన కారణంగా జనాభా తగ్గిందన్నారు. జనాభా నియంత్రణ పెట్టక పోతే మన ప్రాంతంలో జనాభా భారీగా పెరిగేదన్నారు. ఇప్పుడు నియోజకవర్గాల సంఖ్య తగ్గిందని, ఉత్తరాధిన బిజెపి బలంగా ఉండటంతో సీట్లు పెంచడానికే జనాభా ప్రాతిపధికన కాకుండా, సీట్లు ప్రాతిపధికన పెంచాలన్నారు. పార్లమెంట్ దేశ ప్రజల ఉమ్మడి నిర్ణయంగా సాగాలన్నారు. టిడిపి, జనసేన, వైసిపి ఈ విషయంలో మాట్లాడం లేదని, మోడీ కోసం ఈ ముగ్గురు నేతలు దాసోహం అవుతున్నారని విమర్శించారు. మోడీ కార్పోరేట్ విధానాలు, మతోన్మాదం, ఆధిపత్యస్వామ్యక విధానాలు, దేశానికి ప్రమాదకరమని, దీనిని ఓడించడానికి రాబోయే రోజుల్లో రాజకీయ కర్తవ్యం కావాలన్నారు. ఇందుకోసం పార్టీని బలోపేతం చేయాలన్నారు. 30 ఏళ్ళ యుపిఎ, నేషనల్ ఫ్రెంట్, సెక్రులర్ ఫ్రంటులను సూచామన్నారు. బిజెపిని ఓడించాలంటే ఇతర పార్టీలతో కలిసి ముందుకు పోవడం కన్నా, వామపక్షాలు, అందులోనూ సిపిఎం బలపడాలన్నారు. స్థానిక సమస్యలపై నిరంతరంగా పోరాటాలు సాగించాలని, ప్రజలతో కలసి గడపాలన్నారు. ప్రజల వద్దకు వెళ్లి అక్కడే సన్నితంగా ఉండాలన్నారు. వర్గ పోరాటాలు, ప్రజా పోరాటాలు ఉధృతం చేసి, స్ధానిక నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఎర్రజెండా నిలబడాలని పిలుపునిచ్చారు. ఆ మహాసభకు అధ్యక్ష వర్గంగా షాహీనా బేగం, సంపత్, కొండ ప్రసాద్ వ్యవహరించారు. ఎం. సుధాకర్ సంతాప సందేశం ప్రవేశపెట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, అజెయ్‌కుమార్, ఎం. మోహన్‌రావు, నాయకులు తుళ్లూరు గోపాల్, పుల్లయ్య, రేహనా బేగం, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకురాలు రమమ్మ, చిత్రంలో విఎస్ఆర్, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు




మహాసభకు హాజరైన ప్రతినిధులు

సిపిఎం రూరల్ కార్యదర్శిగా కొండా ప్రసాద్

21 మందితో నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సిపిఎం రూరల్ 4వ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. సిపిఎం రూరల్ నూతన కార్యవర్గాన్ని 21 మంది సభ్యులతో ప్రకటించారు. రూరల్ కార్యదర్శిగా కొండా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. ఎం.డి అబ్దుల్ అజీజ్, డి.సంపత్‌కుమార్, ఎస్‌కె షాహీనా బేగం, ఎం.సుధాకర్, రఫీఅహ్మద్, కె. పెంచలనర్సయ్య, క్రాంతికుమార్, కట్టా సతీష్, బి.నాగేశ్వరరావు, కండే కోటేశ్వరరావు, ఎన్.మాలకొండయ్య, ఎస్‌కె .రుబియా, జె.తిరుపాలు, ఒ.సుధీర్, ఎస్‌కె .షంషాద్, పోతురాజు శ్రీనివాసులు, ఆర్ వెంకట్రావు, ఆనిల్,మరో ఇద్దరు సభ్యులుగా ఎన్నికైనట్లు ప్రకటించారు.



కొండా ప్రసాద్, సిపిఎం రూరల్ కమిటీ నూతన కార్యదర్శి

నేటి నుంచి 'పది' పరీక్షలు

- -31తేదీ వరకు నిర్వాహణ
- -విద్యార్థులకు ఉచిత ఆర్‌టిసి బస్
- -అధికారులు పటిష్ట ఏర్పాట్లు



ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నేటి నుంచి పదో తరగతి పరీక్షలకు జరగనున్నాయి. ఇందుకోసం . అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద మంచినీరు, ఫ్యాన్లు, విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా బెంచ్‌లు, ఉండేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎక్కడైనా విద్యార్థులకు అసౌకర్యం కలిగినా ఏర్పాట్లు సరిగా లేకపోయినా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. సమీపంలో వంద మీటర్ల దూరంలో ఎక్కడా జెరాక్స్ మిషన్లు అందుబాటులో లేకుండా చూస్తున్నారు. నేటి నుంచి ఈనెల 31 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే ప్రశ్నాపత్రాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. విద్యార్థులు భయం వదిలేస్తే. విజయం సాధిస్తారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా చూస్తున్నారు. పది పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే కలెక్టర్ ఒ. ఆనంద్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాపితంగా 174 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 33,434 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. 16,250 మంది బాలికలు, 17184 మంది బాలికలున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరగనున్నాయి. అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యం ఐనా పరీక్ష కేంద్రానికి అనుమతించమని అదికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాపితంగా పరీక్షలకు హాజరుకానున్న విద్యార్దులకు . ఆర్‌టిసి బస్సులో ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తున్నారు. హాల్ టికెట్ చూపిస్తే అనుమతిస్తారు.

'అమరజీవి' త్యాగాలు మరువలేనివి..

ప్రజాశక్తి-నెల్లూరు :ఆంధ్ర రాష్ట్ర సాధనకు తన ప్రాణాలను పణంగా పెట్టిన పొట్టి శ్రీరాములు త్యాగాలు చరిత్రలో మరువలేనివని కలెక్టర్ ఆనంద్ అన్నారు. ఆదివారం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద గల శ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ ఆనంద్ కమిషనర్ సూర్య తేజ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగాలు అజరామరమన్నారు.బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మి, పలువురు ఆర్యవైశ్య నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారుఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు అసువులు బాసిన ధన్యజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కరరావు అన్నారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

.జనసేన ఆధ్వర్యంలో.. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జనసేన పార్టీ సీనియర్ నేత, కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున్ యాదవ్ అన్నారు. కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పించారు.

వైసిపి కార్యాలయంలో..అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా మాజీ మంత్రి ,ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసిపి అధ్యక్షులు డాక్టరు కాకాణి గోవర్ధన్ రెడ్డి జిల్లా వైసిపి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు త్యాగాలను కొనియాడారు.

14న ఎస్‌టి వర్గీకరణ భేరి

యానాదుల సంక్షేమ సంఘం

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్రంలోఎస్టీల వర్గీకరణ కు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ నెల్లూరు లో ఏప్రిల్ 14 వ తేదీన యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఎస్టీ వర్గీకరణ భేరీకి రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన యానాదులు, ఉద్యోగ సంఘ ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసి పెంచలయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కావలి పట్టణంలోని స్థానిక జర్నలిస్ట్ క్లబ్ నందు ఆ సంఘ నాయుకులతో కలిసి మాట్లాడుతూ రాష్ట్రంలో 37 లక్షల గిరిజన జనాభాలో 10 లక్షలు యానాది జనాభా 30 శాతం ముందంజలో ఉందని తెలిపారు. ఆర్థికంగా రాజకీయంగా సామాజికపరంగా వెనుకబడి ఉందని అందుకు ప్రత్యేక వర్గీకరణ అవసరమని పేర్కొన్నారు. యానా దులలో అమాయకత్వం , నిరక్షరాస్యత, భయం వంటి కారణాలు ఉన్నాయని అందుకోసమే సుప్రీంకోర్టు 2024 ఆగస్టు 1 వ తేదీన ఇచ్చిన తీర్పును అనుసరించి ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలని కోరారు. ఎస్సీల్లో ఏబిసిడి వర్గీకరణ లాగానే ఎస్టీల్లో కూడా వర్గీకరణ చేయాలన్నారు. యానాదుల సంక్షేమ సంఘం జిల్లా చైర్మన్ రాపూరు కష్ణయ్య, అధ్యక్షుడు మురళి,ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉద్యోగ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చేవూరు సుబ్బారావు, జిల్లా కోశాధికారి పోట్లూరి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి మలికి చెంచయ్య, చలంచర్ల రవీంద్ర, శివకంకర్, ఉషా, సతీష్ చంద్ర, నాగరాజు ఉన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి

అమరజీవి స్ఫూర్తి ప్రదాత : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు : భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కషిచేసిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని, అటువంటి మహనీయుని జయంతి కార్యక్రమంలో పాల్గొనటం ఆనందంగా ఉందని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. కందుకూరు పట్టణంలోని వెంకటనారాయణ బజార్ వద్ద ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా ఇంటూరు నాగేశ్వరరావు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు కాంస్య విగ్ఈ కార్యక్రమానికి ముందుగా ఇంటూరు నాగేశ్వరరావు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు గారి కాంస్య విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగువారి కోసం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని అమరజీవి పొట్టి శ్రీరాములు 56 రోజులు నిరాహారదీక్ష చేసి తన ప్రాణాలను తణప్రాయంగా వదిలేసిన మహనీయులు అమరజీవి పొట్టి శ్రీరాములు అని అన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతులు మీదుగా అల్పాహారం పంపిణీ చేశారు.అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం ఏర్పాటుకు, విగ్రహం వద్ద ఫ్లాష్ లైట్ ఏర్పాటు చేసినందుకు, బ్యాంకు బజార్ వాసుల కోరిక మేరకు అడిగిన వెంటనే కల్వర్టు నిర్మించిన ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావుని నగర ఆర్యవైశ్యుల తరపున ఘనంగా సన్మానించారు. డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు, కాంస్య విగ్రహ దాతల కొనిజేటి రవికుమార్, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ గౌరవాధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు, కోదండ రామాలయ ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకట సుబ్బారావు, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, వలేటివారిపాలెం మండల టీడీపీ అధ్యక్షులు లక్ష్మీనరసింహం, మురారి శెట్టి సుధీర్ కుమార్, చక్కా వెంకట కేశవరావు, కోటా కిషోర్ బాబు, ఉన్నారు.

గుక్కెడు తాగునీటి కోసం ప్రజలు అవస్థలు

ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి 'విఎస్ఆర్'

ప్రజాశక్తి-నెల్లూరు :ఒకవైపు దేశ ప్రధాని నరేంద్ర మోడీ జలజీవన్ మిషన్ పేరుతో ఉచితంగా మంచినీరు సరఫరా చేస్తామని ప్రకటనలు చేస్తున్నారని, మరోవైపు నెల్లూరు నగరంలో గుక్కెడు తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్న పరిస్థితి ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సాగుతున్న ప్రజా చైతన్య యాత్ర ఆదివారం స్థానిక 54వ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ కాలనీలో యాత్ర సాగింది. ఈ యాత్రలో ముఖ్య అతిథిగా వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. భగత్ సింగ్ కాలనీలోని పలు వీధుల్లో ప్రజల ఇళ్ల వద్దకెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొళాయిల్లో మురుగు నీరు వస్తుందని, వాడుకోవడానికి ఇబ్బందిగా ఉందని ఆయన వాపోయారు. పెన్నానదిలో రివి ట్ మెంట్‌గోడ కడుతుండటంతో భగత్ సింగ్ కాలనీలోని డ్రెయినేజీ వాటర్ బయటకు వెళ్లేందుకు దారి లేకుండా కాంట్రాక్టర్ అడ్డుగా కట్టవేయడంతో మొత్తం ఒకే చోట మురుగునీరు చేరి దుర్గంధంగా వెదజల్లుతోందని ప్రజలు ఆయనకు తెలిపారు. దానిపై స్పందించిన 'విఎస్ఆర్' అక్కడి నుంచే ప్రజల సమక్షంలో ఇరిగేషన్ అధికారులకి ఫోన్ చేసి సమస్య తీవ్రతను వివరించారు. 24 గంటలలో సమస్యకు పరిష్కారం చూపకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి మురుగునీరు వెళ్లకుండా అడ్డుకట్టగా వేసి ఉన్న కట్టను తెగగొడతామని ఆయన అధికారులు హెచ్చరించారు. ఏ నోటీసు ఇవ్వకుండా దౌర్జన్యంగా తొలగించిన ఇళ్లకు సంబంధించి బాధితులంతా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు. నెల్లూరు నగరంలో కొళాయి పన్నులకు సంబంధించి నోటీసులు ఇచ్చి ప్రజలను వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. మౌలిక సదుపాయాలు లేక నగరంలో ప్రజలు అల్లాడుతుంటే, వాటిని వదిలేసి 166 ప్రత్యేక టీములను పన్నుల వసూలు కోసం ఏర్పాటు చేసి నెల్లూరు నగర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాబోయే వారం రోజులు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని అనంతరం, మార్చి 22వ తేదీ నుంచి సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆందోళన, పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్,నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు జీ. నాగేశ్వరరావు, షేక్ మస్తాన్ బి, పి. సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ,మూలం ప్రసాద్,షేక్ జాఫర్,పి.వేణు శాఖా కార్యదర్శులు షేక్.కరిముల్లా, గడ్డం శ్రీనివాసులురెడ్డి, స్థానిక నాయకులు ఉడత ప్రసాద్, ఖాజా వలి, వహీదా, రసూల్, సమివుల్లా, ఫజులు,అల్లాబక్షు, ఖాదర్ ఉన్నారు.



తోటపల్ల గూడూరులో..



పెన్నా రివిట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న సిపిఎం విఎస్ఆర్

తోటపల్లిగూడూరు ప్రజా చైతన్య యాత్రల ను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పేడూరులో సిపిఎం ప్రతినిధులు పచ్చా మధు, కాల్తిరెడ్డి రమణమ్మ, రాధయ్య తదితరులతో కలసి ఆయన ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మ య్య మాట్లా డుతూ రాష్ట్రంలో కూటమి ప్రభు త్వం సూపర్ సిక్స్ తో పాటు అనేక రకాల వాగ్ధానాలు చేసి అధికారం లోకి వచ్చిందని, అంతేకాకుండా గ త ప్రభు త్వ పాలనలో ప్రజలపై వేసి న పన్నుల భారాలు, ఆకాశా న్నంటి న నిత్యావసర ధరలు, ల్యాండ్ టైటి ల్ యాక్ట్ వంటి ప్రజా వ్యతిరేక విధా నాలపై విసిగి వేసారిన ప్రజ లు కూ టమికి పట్టం కట్టారన్నారు.

కందుకూరు అభివృద్ధే ధ్యేయం

- -నా వ్యక్తిత్వం సిఎం, ప్రజలకు తెలుసు..
- -ఓడించేందుకు కుట్ర చేసిన వారే విష ప్రచారం.. అయినా భయపడను..
- -హామీలన్నీ నెరవేర్చాకే 2029లో ఓట్లు అడుగుతా..
- -ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఉద్ఘాటన

ప్రజాశక్తి-కందుకూరు

తన అజెండా కందుకూరు అభివృద్ధి మాత్రమేనని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి మాత్రమే తన అజెండా అన్నారు. ఎవరికో భయపడి రాజకీయాలు చేయాల్సిన అవసరం తనకు లేదన్నారు. తన వ్యక్తిత్వం ఏమిటన్నది ముఖ్యమంత్రి చంద్రబాబుకు, నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసన్నారు. తనంటే గిట్టనివారు తనపై కావాలనే విషప్రచారం చేస్తున్నారని, . కాలమే అన్నిటికీ సమాధానం చెబుతుందన్నారు..రామాయపట్నం పోర్టుకు సంబంధించి రైతులకు నష్ట పరిహారం విషయంలో తాను వారికి పూర్తిగా అండగా నిలిచాననిఎంఎల్శ్రీ చెప్పుకొచ్చారు. నష్టపరిహారం పెంచి ఇవ్వాలని కోరుతూ మంత్రులను, ఉన్నతాధికారులు అనేకసార్లు కలిశానన్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని మాత్రమే పోర్టు వారిని కోరానన్నారు. కర్లపాలెం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయంలో ప్రజలకు నష్టం జరిగిందన్నారు. గత ప్రభుత్వం చేసిన పొరపాట్లు వల్ల భూములిచ్చిన రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వారికి న్యాయం చేయాలంటూ మంత్రులను ఉన్నతాధికారులను అనేకసార్లు కలిశానన్నారు. పోర్టుకు భూములు ఇచ్చినవారికి అన్ని విధాలా న్యాయం జరిగేంతవరకు నిరంతరం ప్రయత్నిస్తానని, అందులో ఏమాత్రం రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నిర్వాసితులకు మంచి ప్యాకేజీ అందేలా కషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహకారంతో నెరవేర్చి 2029 ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని ఎంఎల్ఎ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల కందుకూరు వచ్చినప్పుడు నియోజకవర్గంలోని 19 పంచాయితీల్లో తాగునీటి సమస్య గురించి వివరించగా ఆయన తక్షణమే స్పందించి 22 కోట్ల రూపాయలు మంజూరు చేశారని చెప్పారు. కందుకూరు మున్సిపాలిటీకి కూడా చంద్రబాబు నాయుడు 50 కోట్లు ఇస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీకి కట్టుబడి రెండు రోజుల క్రితమే తొలి విడతగా 5 కోట్లు మంజూరు చేశారని ఎంఎల్ఎ చెప్పారు. కొండముడుసుపాలెం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కషితో అప్రూవల్ వచ్చిందన్నారు. సిటీఆర్ ఐ నుండి వాసవి నగర్ వరకు రోడ్డు విస్తరణ త్వరలో జరుగుతుందని, 8 కోట్లతో మున్సిపాలిటీలో అభివద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్. కింద 27 కోట్లతో అభివద్ధి పనులు జరుగుతున్నాయని, ఇప్పటివరకు 120 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయాలు అందించామని చెప్పారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, కూనం నరేంద్ర, షేక్ రఫీ ,టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

టిడిపిలో చేరిన 'తానికొండ' కుటుంబం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణం గుర్రం వారిపాలెం నకు చెందిన తానికొండ శ్రీనివాసులు కుటుంబం వైయస్సార్సీపిని వీడి ఆదివారం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలుగుదేశం పార్టీ కండువా తానికొండ శ్రీనివాసులుకి కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైసీపీని వీడి టీడీపీలోకి చేరుతున్నారని అన్నారు. తానికొండ శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివద్ధి కోసం తన శక్తి వంచన లేకుండా కషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని గజమాలతో ఘనంగా సన్మానించి, ధన్యవాదాలు తెలిపి మిఠాయి తినిపించారు. తానికొండ శ్రీనివాసులు గతంలో తెలుగుదేశం పార్టీలోనే ఉంటూవచ్చారు.అనతరం పార్టీలో వచ్చిన కొన్ని కారణాల వల్ల వైసీపీలో చేరారు.తిరిగి మళ్ళీ టిడిపిలో చేరారు. టిడిపి నాయకుల పొడపాటి నరసింహం, టెలికాం బోర్డ్ మెంబర్ గుర్రం మాల్యాద్రి, మాజీ తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు చదలవాడ కొండయ్య, బత్తిన వెంకయ్య,షేక్ మూస, చనుమోలు శ్రీధర్ ఉన్నారు.



ఎంఎల్ఎ ఇంటూరి సమక్షంలో టిడిపిలో చేరిన తానికొండ శ్రీనివాసులు

కాన్షీరాం జయంతి

ప్రజాశక్తి-కందుకూరు : కాన్షీరాం 91వ జయంతి ఉత్సవాల్లో భాగంగా కందుకూరు వెంగమాంబ ఫంక్షన్ హాలులో రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎండ్లూరి బాలు అధ్యక్షతన సభ ఆదివారం జరిగింది.ఈ కార్యక్రమానికి అతిథులుగా విచేసిన వక్తలు న్యాయవాది ముప్పవరపు.కిషోర్ , రాష్ట్ర కమిటీ సభ్యులు బెజవాడ కొండయ్య, ప్రముఖ అంబేద్కరిస్ట్ లు గేరా చిరంజీవి, పాలేటి కోటేశ్వరరావు, బి. వెంకటేశ్వర్లు,యాదవ జేపీసీ నాయకులు మిరియం. శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. గుడ్లూరు మండల ఇన్‌ఛార్జి సవలం చెన్నయ్య, ఉలవపాడు మండల ఇన్చార్జి రాయపాటి ప్రశాంత్,కొండేపి నియోజకవర్గ ఇన్చార్జ్ బడుగు నాగభూషణం, వై ఉజ్వల్ తమిళనాడు రాష్ట్ర కమిటీ సభ్యులు గుర్రాల శ్రీనివాసులు) తదితరులు పాల్గొన్నారు. భారీ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలో ఆదివారం ప్రతి ఇంటిలో దుస్తులు పాతవి కొత్తవి వారికి సరిపోనివి, ఉపయోగపడనివి సేకరించి ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ వారికి అందించారు. సంస్థ నిర్వాహకులు అందరూ కలిసి ఆ బట్టలని ఊరిబయట నివాసం ఉండే వద్ధులకు, పిల్లలకు బట్టల అవసరం ఉందో తెలుసుకొని వారికి అందజేశారు. ప్రెసిడెంట్ సాజిద్, సెక్రటరీ షంషేర్, ట్రజరర్ హాఫీజ్, ఇంచార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్, షంషఉద్దీన్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికను పరిరక్షించాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని ఈదూరులో ముస్లిముల శ్మశానవాటికలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు టిడిపి నాయకులు చేసిన యత్నాన్ని ముస్లిములు వ్యతిరేకించిన విషయం తెలిసిందే. కాగాఏ రాజకీ య పార్టీ ప్రమేయం లేకుండా ముస్లిం సోదరులు శ్మశాన వాటికను కాపాడుకోనేందుకు చేపట్టిన పోరాటానికి కొం దరు రాజకీయ రంగు పూయడం పట్ల ముస్లిములు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివా రం ముస్లిం పెద్దలు మాట్లాడుతూ కొన్ని రాజకీయ పార్టీ లకు చెందిన ముస్లిం సోదరులు తమ అధిష్టానం మె ప్పు కోసం శ్మశానాన్ని కాపాడుకొనే విషయంలో వెన క డుగు వేస్తున్నారన్న ప్రచారం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయాలకతీతంగా శ్మశాన వాటికను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ముస్లిములపై ఉందన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి..!

తోటపల్లిగూడూరు : వలంటీర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరు తూ విజయవాడ ధర్నా చౌక్ లో నేడు జరి గే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అ ధ్యక్షులు టివివి ప్రసాద్, సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రాజాలు పిలుపునిచ్చారు. ఆదివారం తోటపల్లి గూడూరు మండలంలోని నరుకూరులో వారు మాట్లాడుతూ వాలంటరీ వ్యవస్థను కొన సాగించాలని, రాష్ట్ర ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేస్త వస్తు న్నామన్నారు. వాలంటీర్ వ్యవ స్థను రద్దు చేయ డంతో రెండున్నర లక్షల మంది కు టుంబాలు రోడ్డున పడ్డాయన్నారు.



గురుకుల పాఠశాలలో వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
ఆత్మకూరు పట్టణంలోని (ఏపిఆర్) ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర్ రెడ్డి విచ్చేసి విద్యార్థులకు చక్కని సందేశాన్ని అందించి సరస్వతీ దేవి మండపాన్ని కట్టించి ఈ పాఠశాల విద్యార్థులకు అందిస్తానని సభాముఖంగా తెలియజేశారు. ప్రిన్సిపల్ కామేశ్వరి ఆధ్వర్యంలో వార్షికోత్సవం జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా కంచి పరమేశ్వర్ రెడ్డిని పాఠశాల యాజమాన్యం మరియు అక్కడికి వచ్చిన అతిథులు వారి సేవా తత్పరతన్ని కొనియాడి శాలువతో సత్కరించి వర్ధిల్లాలని వారిని ఘనంగా సన్మానించి మొక్కను అందించారు. అలాగే భవిష్యత్తులో ఈ పాఠశాల అభ్యున్నతికి తమ ట్రస్టు సహకారం అందిస్తుందని సభాముఖంగా కంచి పరమేశ్వర్ రెడ్డి తెలియజేశారు. సిఐ గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపల్ కామేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుముఖ ప్రజ్ఞాశాలి శారద

ప్రజాశక్తి-నెల్లూరు : బహుముఖ ప్రజ్ఞాశాలిగా నెల్లూరులోని నేతాజీ నగర్‌కు చెందిన కమంచి శారద పేరుగాంచారు. ఈ మేరకు ప్రభుత్వ హిందీ ఉపాధ్యాయినిగా, విద్య, సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవారంగాలలో ప్రతిభ కనబరచినందుకుగాను హైదరాబాద్‌కు చెందిన శిఖరం ఆర్ట్ థియేటర్స్ వారు, ఇందిర ఆర్ట్ ఫౌండేషన్ హైదరాబాద్ వారు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 12వ త్యాగరాయ గానసభ హైదరాబాద్‌లో 'మహిళా శిరోమణి 2025 అవార్డు'ను ముఖ్య అతిథి డాక్టర్ సముద్రాల వేణు గోపాలాచార్య, సంస్థ నిర్వాహకులు జి.కృష్ణ, ఇందిరా ఆర్ట్ ఫౌండేషన్ హైదరాబాద్ వారు సారెగ స్టూడియో హిమాయత్ నగర్ హైదరాబాద్‌లో 15వ సోషల్ ఎక్సలెన్సీ అవార్డు 2025ను విశిష్ట అతిథి పసునూరి శ్రీనివాస్, సంస్థ నిర్వాహకులు డాక్టర్ ఎన్.ఇందిర, డాక్టర్ అంజనీ కుమారి, డాక్టర్ ఆలూరి విల్సన్ తదితరులతో జ్ఞాపిక, ప్రశంసా పత్రం, శాలువాతో ఘనంగా సత్కరించి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, సంగీత సాహిత్య సామాజిక సేవకులు శారదకు అభినందనలు అందజేశారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు మండలంలో సోమవారం నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఆరు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఇఒ-2 వై.చెంచుకృష్ణమ్మ తెలిపారు. స్థానిక జెబిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు మండలంలో మొత్తం ఆరు కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పడిపోతు రామనాయమ్మ జెడ్‌పి హైస్కూల్లో 226మంది, జెబిఆర్ ప్రభుత్వ పాఠశాలలో 165మంది, ఇనమడుగు ఉన్నత పాఠశాలలో 144, న్యూలిటిల్ ఫ్లవర్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 144, విశ్వ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 168, సెయింట్ పాల్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 168మంది పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై సంబంధిత పరీక్షా అధికారులతో ఆమె చర్చించారు.

నవీన్‌కు పురస్కారం అందజేత



ప్రజాశక్తి-కావలి : గుంటూరు జిల్లా పొన్నూరులో నిర్వహించిన "మన పొన్నూరు బ్లడ్ అసోసియేషన్" వారి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న పలు స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపకులకు, అధికసార్లు రక్తదానం చేసిన రక్తదాతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా లైఫ్‌లైన్ ఫౌండేషన్ ద్వారా తాటికొండ నవీన్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు గానూ దుశ్శాలువతో సత్కరించి సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పురస్కారంతో సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు జనసేన నాయకులు చందు సాంబశివ, నాయకురాలు భోనం పార్వతినాయుడు, ఆంధ్ర రేఖ చైర్మన్ వసంత్, జాతీయ ఫండమెంటల్ లీగల్ రైట్స్ చైర్మన్ కల్పన, ఇతర అతిథులు తాటికొండ నవీన్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తాటికొండ నవీన్ మాట్లాడుతూ 50సార్లు పైగా రక్తదానం చేయడంతో పాటు అత్యవసర సమయంలో రక్తదాతల సహకారంతో ప్రాణాలను కాపాడుతున్నందుకు, లైఫ్‌లైన్ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న అనేక సేవాకార్యక్రమాలను గుర్తించి అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డు ప్రదానం చేసిన పొన్నూరు రక్తదాతల సంఘం వ్యవస్థాప కులు తిరుమలశెట్టి ఉమాశంకర్‌కి నవీన్ కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చందు సాంబశివ, జనసేన నాయకురాలు భోనం పార్వతినాయుడు, ఆంధ్ర రేఖ చైర్మన్ వసంత్, జాతీయ ఫండమెంటల్ లీగల్ రైట్స్ చైర్మన్ కల్పన, కవి రంగిశెట్టి రమేష్, పొన్నూరు రక్తదాతల సంస్థ వ్యవస్థాపకులు ఉమాశంకర్, సంస్థ సభ్యులు, ఆంధ్ర, తెలంగాణ స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నాయకులకు అభినందనలు



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురంలో జరిగిన జయకేతనం సభకు తరలివచ్చిన మండల అధ్యక్షులు సయ్యద్ అక్బర్‌బాషా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి, పక్కా ప్రణాళికతో నెల్లూరు నుండి సభకు విచ్చేసిన అందరికీ భోజన, వసతి సదుపాయం లో ఎలాంటి అసౌకర్యం జరగకుండా చూసుకున్న నెల్లూరు జిల్లా ఇన్‌ఛార్జ్ వేములపాటి అజయ్‌కు మండల జనసేన పార్టీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

ఎస్‌టి వర్గీకరణ భేరి జయప్రదం చేయండి



ప్రజాశక్తి-కావలి : రాష్ట్రంలో ఎస్‌టిల వర్గీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ నెల్లూరులో ఏప్రిల్ 14వ తేదీన యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఎస్‌టి వర్గీకరణ భేరీకి రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన యానాదులు, ఉద్యోగ సంఘ ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెసి పెంచలయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో ఆ సంఘ నాయకులతో కలిసి ఆయన ఎస్‌టి వర్గీకరణ భేరి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 37లక్షల గిరిజన జనాభాలో 10 లక్షలు యానాది జనాభా 30శాతం ముందంజలో ఉందని తెలిపారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికపరంగా వెనుకబడి ఉందని అందుకు ప్రత్యేక వర్గీకరణ అవసరమన్నారు. యానాదులలో అమాయకత్వం, నిరక్షరాస్యత, భయం వంటి కారణాలున్నాయని అందుకోసమే సుప్రీంకోర్టు 2024 ఆగస్టు 1వ తేదీన ఇచ్చిన తీర్పును అనుసరించి ఎస్‌టి వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలని కోరారు. ఎస్‌సిల్లో ఎ బి సి డి వర్గీకరణ లాగానే ఎస్‌టిల్లో కూడా వర్గీకరణ చేయాలన్నారు. రాష్ట్రంలో యానాదుల సమస్యలను, ఇబ్బందులను తెలియజేసేందుకు చట్ట సభల్లో ఒక్కరికీ కూడా ప్రాధాన్యత లేదని తెలిపారు. రాజకీయ పార్టీలు యానాదులను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటుందని తమ జనాభా ఉన్న దగ్గర కూడా రాజకీయంగా తమ వాటా ప్రకారం పదవులు కూడా దక్కడం లేదని ప్రశ్నించారు. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో యానాదుల కోసం నెల్లూరులో ప్రత్యేకంగా ఐటిడిఎ కార్యాలయం ఏర్పాటు చేశారని ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు నిర్వీర్యం చేసాయన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాలలో యానాదులకు న్యాయం జరిగేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా చైర్మన్ రాపూరి కృష్ణయ్య, అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరు సుబ్బారావు, జిల్లా కోశాధికారి పోట్లూరి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి మలికి చెంచయ్య, నాయకులు చలంచర్ల రవీంద్ర, శివకుమార్, ఉషా పాల్గొన్నారు.

అత్యున్నతమైన ఆదర్శ వైద్యశాల 'పిపిసి'



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నెల్లూరు
రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే అత్యంత ఆదర్శనీయంగా 1940లో ఏ ఆదర్శాలతో డాక్టర్ రామచంద్రారెడ్డి తన సర్వస్వాన్ని ధారపోసి ఆసుపత్రిని నెలకొల్పారో.. నేటికీ అదే ఆశయంతో రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే నేటికీ కొనసాగిస్తూ ఒక అత్యున్నతమైన ఆదర్శ వైద్యశాలగా తీర్చిదిద్దుతున్న ప్రతిఒక్కరినీ పేరుపేరునా అభినందిస్తున్నానని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల వార్షికోత్సవ కార్యక్రమం జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఉషారాణి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ముందుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. డాక్టర్ రామచంద్రారెడ్డి ఉన్న సమయంలో పుచ్చలపల్లి సుందరయ్య వారి సోదరుడు, కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరి ప్రోత్సాహంతో, తన సొంత కుటుంబాన్ని సైతం కాదని ప్రజలకు అంకితం చేశారని గుర్తు చేశారు. నేడు వైద్యరంగం అంతా ప్రయివేటుపరం అయిందని, కార్పొరేట్, అతిపెద్ద వ్యాపార రంగంగా మారిపోతున్న తరుణంలో, విదేశాలలో అయితే పెద్దఎత్తున ఈ రంగంలో పెట్టుబడులు పెడుతున్న రంగంగా మారిపోయిందన్నారు. ఎంత ఖర్చు అయినా ప్రాణాలను కాపాడుకోవాలన్నా తపన నెలకొందన్నారు. మనిషి జీవించాలన్న కోరికను సైతం వ్యాపారంగా మార్చివేస్తున్నారన్నారు. జబ్బులు రాకముందే నివారణ అంశాలపై దృష్టి కేంద్రీకరించాలని గుర్తు చేశారు. డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలలో శిక్షణ పొంది వారు ఏ ప్రాంతంలో వైద్య వృత్తిలో ఉన్నా ఆదర్శాన్ని పాటిస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైద్యశాలకు రోగి ప్రధానమన్నారు. ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో సర్జరీ జరుగుతున్న సమయంలో డాక్టర్, నర్సింగ్ సిబ్బంది, అనస్థీషియా విభాగం వైద్య నిపుణులు, స్పెషలిస్టులు అందరూ ఉన్నప్పటికీ వీరందరికంటే ముఖ్యమైన వ్యక్తి రోగి మాత్రమే అని గుర్తు చేశారు. రోగికి నమ్మకం ఉన్నంత కాలం ఆసుపత్రి సేవలు దిగ్విజయంగా సాగుతాయన్నారు. 1940లో నగరంలో పిపిసి స్థాపించినప్పటికీ, రెండవ ప్రపంచ యుద్ధం వచ్చిన సమయంలో ఇదే వైద్యశాల నుంచి ఇద్దరు వైద్యులు వైద్య సేవలందించేందుకు వెళ్లిన సంగతి గుర్తు చేశారు. తిరిగి 1942లో ఇదే వైద్యశాలలో సేవలు ప్రారంభం అయినప్పటికీ 1943లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఇలా డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల చరిత్రను వివరించారు. ఈ వార్షికోత్సవ సభకు డాక్టర్ కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. చివరగా వైద్యశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సిబ్బందికి నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభను చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.రాజాజేశ్వర రావు, డాక్టర్ రమేష్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ అజయ్‌కుమార్, నాగేశ్వరరావు, పిపిసి ఎగ్జిక్యూటివ్ సభ్యులు, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం ఏర్పాటు



ప్రజాశక్తి-కావలి
కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశాల మేరకు ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సూచనల మేరకు సోమవారం నుండి మద్దూరుపాడు టిట్కో గృహ సముదాయం తనకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎపిఎస్ ఆర్‌టిసి కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ఈ బస్సు ప్రతిరోజూ ఉదయం కావలి బస్టాండ్‌లో 7.15 గంటలకు బయల్దేరి, టిట్కోకు 7.30 గంటలకు బయల్దేరి కావలికి 7.55 గంటలకు చేరుతుందని, మరలా సాయంత్రం 5.30 గంటలకు కావలిలో బయల్దేరి, 5.45 గంటలకు టిట్కోకు చేరి, 5.50 గంటలకు తిరిగి వస్తుందని వివరించారు. కావున టిట్కో గృహ సముదాయంలో నివసిస్తున్న ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని డిపో మేనేజర్ కోరారు.

10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం సోమవారం నుండి జరుగనున్న 10వ తరగతి విద్యార్థులకు తమ స్వస్థలం నుండి పరీక్షా కేంద్రం హాల్ టికెట్లు ఉచితంగా ప్రయాణించవచ్చని డిపో మేనేజరు పేర్కొన్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులలో మాత్రమే బస్సుపాస్ లేకపోయినా హాల్ టికెట్ చూపించి, పరీక్షా కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణించవచ్చని, పరీక్ష ఉన్న రోజునే అనుమతిస్తామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం
ముంబై జాతీయ రహదారిపై ప్రమాదం చోటు చేసుకోగా, అతివేగంగా కారు ఢీ కొనడంతో ఓ మహిళ అక్కడిక్కడ మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు పోలీసుల సమాచారం మేరకు.. సంగం మండలం జెండాదిబ్బ గ్రామానికి చెందిన షేక్ రహమత్ (55) బుచ్చిరెడ్డిపాలెంలో సెయింట్ మేరీస్ కాలేజీ సమీపాన రోడ్డు దాటుతుండగా నెల్లూరు వైపు వెళ్తున్న ఎపి 40 హెచ్ 3647 టయోటా గ్లాంజా కారు ఢీ కొట్టింది. బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన డాక్టర్ అల్లాభక్షుకు చెందిన కారుగా స్థానికులు పోలీసులు గుర్తించారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళకు గాయాలు



ప్రజాశక్తి-సీతారామపురం
మిద్దెపైన దుస్తులు ఆరేస్తున్న మహిళపై కోతులు దాడి చేయడంతో మిద్దెపై నుండి కిందపడిన మహిళలకు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. సీతారామపురం మండలం కురవిధిలో దుస్తులు ఉతికి మిద్దెపైన ఆరవేద్దామని పైకి వెళ్లిన మహిళపై (కాశమ్మ) కోతులు దాడి చేయడంతో మిద్దెపై నుండి కిందపడి తీవ్రంగా గాయాలయ్యాయి. అక్కడున్న స్థానికులు ఆమని హుటాహుటీనా స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ ప్రథమ ఉచిత అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు.

సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతారామపురం
మండలంలోని సింగారెడ్డిపల్లి గ్రామంలో రూ.10లక్షలతో, శ్రీ ఘటిక సిద్దేశ్వరం, సంగసానిపల్లి గ్రామాలలో మండల నిధులతో సిసి రోడ్డు నిర్మాణాల పనులకు ఎంపిపి చింతరెడ్డి పద్మావతి ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. ప్రముఖ శైవక్షేత్రం సిద్దేశ్వరంలో మండల నిధులతో రూ.10లక్షలతో సిసిరోడ్డు నిర్మాణం, లక్షా 65 వేల రూపాయలతో అరుగు నిర్మాణ పనులకు ఎంపిపి చింతరెడ్డి శంకుస్థాపన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించే పనులను, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ చింతరెడ్డి సుబ్బారెడ్డి, మండల వైస్‌ఎంపిపి సారమ్మా, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ పానెం రమణయ్య, ఎంపిటిసి చిప్పిడి వెంకటమ్మ, మాజీ ఎంపిపి అబ్రహం, సింగారెడ్డిపల్లి సర్పంచ్ సంపూర్ణ, అయ్యావారిపల్లి సర్పంచ్ చింతనబోయిన దుర్గాప్రసాద్, బాలినేని మాబయ్య, తిరుపాలు, లకిడి బ్రాహ్మయ్య, వెంకటరెడ్డి, చింతంరెడ్డి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ప్రజాచైతన్యయాత్ర'




కావలిలో..


కావలిలో..

ప్రజాశక్తి-వరికుంటపాడు
ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలకు నిధులు మంజూరు చేసి అమలు చేయాలని సిపిఎం ఉదయగిరి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కోడె రమణయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన వరికుంటపాడులో ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో సుమారు 250 రోజులు ఉపాధిని కల్పించి వేతనం రోజుకి రూ.600 చెల్లించాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించి పెదిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కాకు వెంకటయ్య, నాయకులు వెంకటరమణయ్య, వెంకటసుబ్బయ్య, పందిళ్ళ వెంకటేశ్వర్లు. తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : ప్రజా సమస్యలపై ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా ఆదివారం 8వ రోజు 36వ వార్డు పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు అక్కడ ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలియజేస్తూ చాలా సమస్యలతో సతమతమవుతున్నామని ముఖ్యంగా తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నామని మున్సిపల్ వాటర్ సగం కాలనీకి మాత్రమే అరకొర నీళ్లు వస్తాయని పూర్తిగా నీళ్లు రావని తెలిపారు. పైపులైన్లు వేసిన కొత్తల్లో కాలనీ అంతా నీళ్లు వచ్చాయని రానురాను సగం కాలనీకి కూడా చాలీచాలని నీళ్ళు వస్తున్నాయని నీళ్ల కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీలో రెండు బోర్లు చెడిపోయి ఉన్నా బాగు చేసిన పరిస్థితి లేదన్నారు. నీళ్లు రాకుండానే కొళాయి పన్నులు వేల రూపాయలు వేసి ఇంటి పన్నులు పెంచి మొత్తం కట్టాలని తమపై అధికారులు ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో తమపై భారాలు మోపి కట్టాలని అధికారులు ఒత్తిడి తేవడం చాలా అన్యాయంగా ఉన్నదని వారి ఆవేదనను సిపిఎం నాయకుల ముందు వెలిబుచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, నాయకులు బి.కృష్ణయ్య, రమణయ్య, మస్తాన్ స్థానికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : మండలంలోని గుమ్మడిబొందల గ్రామంలో సిపిఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జిల్లా కమిటీ సభ్యులు మారుపూడి రాధాకృష్ణయ్య ఆదివారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులందరూ పాల్గొని బిపిసిఎల్ కంపెనీ రామాయపట్నం పోర్టు అనుసంధానంగా పెట్టబోతున్నారని దానివల్ల గ్రామంలో పూర్తిగా పొలాలన్నీ ఆ కంపెనీ కైవసం చేసుకుంటుందని దాన్నివల్ల గ్రామస్తులు బతుకుదెరువు మరింత ఇబ్బందిగా తయారవుతుందన్నారు. పొలాలు పోతే వారు చేసుకునే గీతవృత్తి దెబ్బతింటుందని అదేరకంగా పశువులు తిరిగే దానికి అవకాశం లేకుండా పోతుందని బతుకుదెరువు కూడా తీవ్రంగా ఇబ్బంది పడుతుందని తెలిపారు. చదువుకున్న వారికి కంపెనీ ఉద్యోగాలు ఇస్తానని గ్యారెంటీ కూడా లేదని అందువల్ల తమ భూములు ఆ బిపిసిఎల్ కంపెనీ సోలార్ కంపెనీ తీసుకోకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని అలా చేస్తే మరింత ఆందోళనకు సిద్ధం అవుతామని గ్రామస్తులు తెలియజేశారు. కార్యక్రమంలో వలపర్ల వెంకయ్య, తుళ్లూరు వెంకయ్య, రామకృష్ణ, జమ్ముల శివశంకర్రావు, వెంకటస్వామి, ఉప్పల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-నెల్లూరు : సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా చైతన్య యాత్రల 9వ రోజు పర్యటనలలో భాగంగా ములుమూడి గ్రామంలో ములుమూడి కలుజు, పూడిక తీయనీ డ్రైనేజీ కాలవలను, అపరిశుభ్రంగా ఉన్న వీధులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్ మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా స్థానిక సమస్యలపై మండలంలో పర్యటిస్తున్నామని, తమ దృష్టికి అనేక సమస్యలు వచ్చాయని అనేకమంది విద్యుత్ చార్జీలు పెరిగాయని చెప్పారన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అట్లా అనిల్, గుంటి నాగరాజు, పర్చూరు ప్రభాకర్, ఎడవల్లి రమణయ్య, జానా లక్ష్మీ ప్రసాద్, మరి మేసి కామాక్షయ్య, ఎస్కే అబ్దుల్లా, ఎస్.కె అమీర్ భాష, శ్రీపతి దయాకర్, వి వెంకట రమణయ్య, పి మనోహర్, సాదేపల్లి ఏడుకొండలు, తాళ్లూరు రాజా బండి మురళి పాల్గొన్నారు.

పలుచోట్ల అమరజీవికి నివాళులు


కావలిలో...

ప్రజాశక్తి-కావలి
ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన శ్రీ పొట్టి శ్రీరాములు అమరజీవి అని, ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయులు అని టిడిపి నాయకులు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు కావలి టిడిపి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు వారందరికీ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం దీక్ష చేశారన్నారు. ఆయన పోరాట ఫలితంగా 1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు స్మరించుకోవాల్సిన అవసరం ప్రతి ఆంధ్రుడు మీద ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో కావలి టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, ఆర్యవైశ్య రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ తట్టవతి వాసు, టిడిపి సీనియర్ నాయకులు మొగిలి కల్లయ్య, 26వ వార్డు ఇన్‌ఛార్జి గంగినేని వెంకటేశ్వర్లు, కావలి హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ పొబ్బ సాయి, కావలి హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఏటూరి శివ, టిడిపి నాయకులు తిరివీది ప్రసాద్, కవితా ప్రసాద్, జనిగర్ల మనోహర్ యాదవ్, కిరణ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం గ్రామంలో జువ్వలదిన్నె గ్రామంలో శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను తహశీల్దార్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తహశీల్దారు కార్యాలయ సిబ్బంది శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సురేష్‌బాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, ప్రాణత్యాగం చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు అని, ఆయన జిల్లా వాసి బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామం వాసి కావడం గ్రామాన్ని ప్రభుత్వం టూరిజం గ్రామంలో ప్రకటించి గ్రామాన్ని అభివృద్ధి చేసిందని తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళి అర్పిస్తున్నానని, తెలుగు రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన శ్రీ పొట్టి శ్రీరాములు జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ఆయన త్యాగం చిరస్మరణీయమని, మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణకు జీవితాంతం కృషి చేశారన్నారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆశయ సాధన కోసం అందరం పునరంకితమవతామన్నారు. కార్యక్రమంలో జువ్వలదిన్నె గ్రామస్తులు, తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : తహశీల్దార్ కార్యాలయం అవరణంలో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకులు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అవతరణకు శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రాజా, వేమా మల్లికార్జునరావు, శ్రీరామ్, అనీల్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని కోవూరులోని తహశీల్దార్ కార్యాలయంలో ఆ మహనీయుని చిత్రపటానికి తహశీల్దార్ నిర్మలానంద బాబా పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుడు ఆయనే అన్నారు. అటువంటి వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విఆర్‌ఒ నాగేశ్వరరావు, శ్రీరాములు సిబ్బంది ఉన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : తహశీల్దార్ ఆఫీస్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం నిర్వహించారు. తహశీల్దార్ పి.వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములు అమరజీవి, మహాపురుషుడు, ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి తెలుగు వారికి ప్రత్యేకం రాష్ట్రం కావాలంటూ ఆమరణ నిరాహారా దీక్ష చేపట్టి తన ప్రాణాలను ధారపోశారని గుర్తు చేశారు. అనంతరం చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు కొమ్మి రాజా, వంశీ, మనోహర్ పాల్గొన్నారు.

ఆగని చికెన్‌వ్యర్థాల రవాణా



ప్రజాశక్తి-కోవూరు
ఒకవైపు పర్యావరణాన్ని పూర్తిస్థాయిలో విఘాతం కలిగించే చికెన్ వ్యర్థాలను కోవూరు నియోజకవర్గం లోని ఐదు మండలాల్లో ఏ ప్రాంతంలో కూడా చేపల గుంతలకు వేయరాదని ఈ మేరకు కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తన కార్యాలయంలో మత్స్య శాఖ, పోలీస్ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చికెన్ వేస్ట్‌పై ప్రత్యేక సూచనలు కూడా వారికి ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొంతకాలం సర్దుమణిగిన ఈ చికెన్ వేస్ట్ మాఫియా మళ్లీ చెన్నయ్, బెంగళూరు ప్రాంతాల నుంచి రవాణాకు చర్యలు చేపట్టింది. గత జనవరిలో కోవూరు పోలీసులు చెన్నయ్ నుంచి, బెంగుళూరు నుంచి వస్తున్న నాలుగు వాహనాలను సీజ్ చేసి వాటిపై కేసులు కూడా నమోదు చేశారు. గురువారం కోవూరు సిఐ సుధాకర్ రెడ్డి ఈ చికెన్ వేస్ట్‌పై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కోవూరు సర్కిల్ పరిధిలో ఎక్కడా కూడా చికెన్ వేస్ట్ రవాణా చేయరాదని, చేస్తే వాటిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరికలు జారీ చేశారు. అయినా కూడా ఆదివారం తెల్లవారు జామున చెన్నయ్, నుంచి జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న వాహనాన్ని ఎఫ్ఎఒ శ్రీనివాసులు సూచనల మేరకు ఈ విషయాన్ని కోవూరు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్, పోలీసులు వాహనాన్ని ఆపి పరిశీలించగా అందులో మొత్తం దుర్వాసన వెదజల్లుతున్న 17 చికెన్ వేస్ట్ డ్రమ్ములు ఉన్నాయి. ఈ మేరకు వీటిని అక్రమంగా రవాణా చేస్తున్న వాహన డ్రైవర్ ఈగ నాగరాజు, క్లీనర్ దాసరి గణేష్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం ఈ చికెన్ వేస్ట్ను సమీపంలో ఉన్న పెన్నానది ప్రాంతంలో జెసిబి ద్వారా గొయ్యి తీసి అందులో పూడ్చేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఒ శ్రీనివాసులు మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో ఏ-ఎల్ ప్రాంతంలో అయినా ఈ అక్రమ చికెన్ వేస్ట్ రవాణా అవుతుంటే తన దృష్టికి గానీ, పోలీసుల దృష్టికి గానీ తేవాలని ఆయన అన్నారు. ఈ చికెన్ వేస్ట్ అక్రమ రవాణాకు అధికార పార్టీ నేతల పోత్సాహం ఉందా.. లేక మత్స్యశాఖలో పని చేస్తున్న ఉద్యోగుల ప్రోద్భలం ఉందా.. అనేది సందిగ్ధంగా మారింది. ఎంఎల్ఎ మాత్రం నియోజక వర్గంలో ఎక్కడా కూడా చికెన్ వేస్ట్ అక్రమ రవాణా రావడానికి వీలు లేదని ఖరాఖండిగా చెప్పేశారు.



వైభవంగా ఏకాంతసేవ

ప్రజాశక్తి-బిట్రగుంట : మండలంలోని కొండబిట్రగుంట గ్రామంలో కలిసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆఖరు రోజున ఆదివారం పుష్పయాగం, ఏకాంతసేవా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి, ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆఖరు రోజున స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులతో ప్రజల సుఖశాంతులతో జీవించాలని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని ప్రార్థిస్తున్నామన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆఖరి రోజు కావడంతో జబర్దస్త్ టీమ్‌తో మ్యూజికల్ నైట్ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, నాయకులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.